క్లుప్తంగా

నాసిరకంగా రోడ్డు


పన్నూరులో దెబ్బతిన్న తారురోడ్డు

విజయపురం: జగన్నాథపురం నుంచి పన్నూరు వరకు కేఎస్‌ఆర్ సంస్థ వేసిన రోడ్డు నాసిరకంగా ఉందని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల బెంగళూరు హైవే పనుల నిమిత్తం జగన్నాథపురం అడవి నుంచి గ్రావెల్ తరలించారు. ఇందులో భాగంగా జగన్నాథపురం నుంచి పన్నూరు వరకు ఆ సంస్థ తారురోడ్డు వేసింది. అయితే అది వేసిన కొన్ని రోజులకే లేచిపోవడంతో మండల ప్రజలు మండి పడుతున్నారు. నాసిరకంగా రోడ్డు వేశారని, ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్పంచ్ చొరవతో అక్కేరి రోడ్డుకు మోక్షం


జోరుగా అక్కేరి హెచ్‌డబ్ల్యూ రోడ్డు పనులు

పుత్తూరు: మండల పరిధిలోని వేపగుంట అక్కేరి దళితవాడ రోడ్డుకు సర్పంచ్ గిరిజాప్రసాద్ చొరవతో మోక్షం కలిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలువురు ఈ రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ చొరవ తీసుకొని 500 మీటర్ల రోడ్డును బాగు చేయిస్తున్నారు. రూ.2 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఎంతో కాలంగా ఉన్న రోడ్డు సమస్య తీరుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


నింద్ర: మండల కేంద్రమైన నింద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బీఆర్ సుబ్రమణ్యం శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓలు శ్రీధర్‌రాజు, వసుమతి, సహ ఉపాధ్యాయులు కలిసి సన్మానించారు. 20 సంవత్సరాలుగా మండలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో నాగదేవతలు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రంలో శుక్రవారం నాగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి, దేవరాజులురెడ్డి, నీరజాక్షులురెడ్డి కుటుంబ సభ్యుల నేతృత్వంలో పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా గణపతి పూజ ,కలశ పూజ, హోమం జరిపించారు. అనంతరం సుమారు 400 మంది భక్తులకు అన్నదానం చేశారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం తిరువీధి కుప్పం గ్రామంలోని పాడుబడ్డ బావిలో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తిరువీధి గుప్పం గ్రామంలో ఓ పాడుబడ్డ బావిలో వ్యక్తి మృతదేహం స్థానికుల సమాచారం మేరకు గుర్తించామని, ఆ వ్యక్తి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై మండల పరిధిలో ఎవరికైనా ఆచూకీ లభ్యమైతే.. జీడీ నెల్లూరు పోలీసులకు సంప్రదించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించినట్లు చెప్పారు.

శానిటేషన్ మెరుగుపరచాలి

తవణంపల్లె: గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పల్లెచెరువు, గోవిందరెడ్డిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పల్లెచెరువులో డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గోవిందరెడ్డిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ 30 మంది రోగులకు పరీక్షలు చేయించారు.

పల్లెబాట పట్టని కార్యదర్శులు

వడమాలపేట మండలంలో పంచాయతీ కార్యదర్శుల పని తీరు విచిత్రంగా ఉంది. సచివాలయంలో ఉంటూ, ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కారించాల్సిన బాధ్యత ఉన్నా... అది ఏది పట్టనట్టు ఉదయం సచివాలయానికి హాజరై... మధ్యాహ్నం గంట మోగితే, మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా ఏవో కారణాలు చెప్పి, తిరుపతికి జంప్ అవుతున్నారు. అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపం చేసి ఇంటికెళ్తున్నారు. దీంతో గ్రామంలో ఎక్కడ సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. కొందరు కార్యదర్శులైతే అధికార పార్టీ నాయకుల అండదండలతో కార్యాలయానికి రాకుండానే తిరుపతిలో ఉంటూ తమ సొంత పనులు చేసుకొంటున్నారన్న వాదన వినిపిస్తున్నాయి.

–వడమాలపేట (విజయపురం)

- విధులకు ఇష్టారాజ్యంగా డుమ్మా
- మెరుపులా వచ్చి వెళ్లుతున్నారని ఆరోపణ

వడమాలపేట మండలంలో మొత్తం 22 పంచాయతీలు, 12 సచివాలయాలు, 12 మంది కార్యాదర్శులు పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది విధులకు డుమ్మా కొడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంట పాటు గ్రామ, సచివాలయంలో ఉంటూ, మధ్యాహ్నం అయితే తిరుపతికి వెళ్లిపోతున్నారు. కొందరైతే సచివాయలానికి రావటం మానేసి తిరుపతిలో తమ సొంత పనులు చేసుకొని కూటమి ప్రభుత్వం నాయకులు చెప్పే పనులు చేసుకొని కాలక్షేపం చేసుకొంటున్నారు. ఏ సచివాలయానికి వెళ్లినా ఒకరు, లేదా ఇద్దరు తప్ప కార్యదర్శులు ఉండడం లేదన్న వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇది తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

మూమెంట్ రిజిస్టర్ పాటించరు

సచివాలయానికి వచ్చి హాజరు పట్టికలో సంతకం పెట్టిన సిబ్బంది బయటకు వెళ్లే ముందు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత పని ముగించుకొని తిరిగి సచివాలయానికి వచ్చిన తరువాత ఎన్ని గంటలకు వచ్చారు అనే విషయం తప్పని సరిగా రాయాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు.


పూడి సచివాలయం

పని వేళల్లో కానరారు

పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10 గంటలకు హాజరు వేయాలి. అయితే చాలా మంది 11 గంటలకు కూడా సచివాలయాలకు చేరుకోవడం లేదు. ఒక వేళ వచ్చినా గంటకు పైగా ఉండడం లేదు. దీన్ని అనువుగా తీసుకొని సచివాలయంలో పని చేస్తున్న చిన్న స్థాయి ఉద్యోగులు తామేమీ తక్కువ కాదంటూ, వాళ్లు కూడా బయట వెళ్లి కాలక్షేమ చేస్తూ ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలు అధికారులు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోతున్నారు.

మా దృష్టికి రాలేదు

ప్రతి కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లితే మూమెంట్ రిజిస్టర్‌లో పొందుపరచాలి. సిబ్బంది అందుబాటులో లేదని మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకొంటాం.

–శేషగిరిరావు, ఎంపీడీఓ, వడమాలపేట

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ


కలెక్టర్‌కు లైవ్‌ప్లాంటు అందిస్తున్న డీఎస్పీ

నగరి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను శుక్రవారం నగరి డివిజన్ డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. నగరి డీఎస్పీగా పదవీ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన కలెక్టర్‌ను కలిసి లైవ్‌ప్లాంట్ అందజేశారు.

ఆధార్ ఎన్‌రోల్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

వెదురుకుప్పం: అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ ఎన్‌రోల్ చేయించాలని ఎంపీడీఓ అమరనాథ్ ఆదేశించారు. శుక్రవారం వెదురుకుప్పంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లల పోషణపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ భారతి పాల్గొన్నారు.

సామాజిక స్పృహ అవసరం

నగరి: సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికీ అవసరమని లయన్స్ క్లబ్స్ 317ఇ జిల్లా గవర్నర్ చంద్ర రెడ్డి అన్నారు. నగరి లయన్స్ క్లబ్, పుత్తూరు లయన్స్ క్లబ్ సంయుక్తంగా మండలంలోని వీకేఆర్‌పురం అశ్వినీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో అమెరికాలో స్థాపించబడిన లయన్స్ క్లబ్స్ స్వచ్ఛంద సంస్థ 55 దేశాలలో విస్తరించిందన్నారు. సామాజిక సేవ అందుకు కారణమన్నారు. గ్రామీణ స్థాయికి కూడా లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించాలన్నారు. ఈ సందర్భంగా 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. 70 మంది విద్యార్థులకు చెప్పులు అందించారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు షీల్డులు అందించి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విస్తృతంగా సేవలు కొనసాగిస్తున్న నగరి, పుత్తూరు లయన్స్‌క్లబ్ వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తొలి వైస్ గవర్నర్ అశ్వంత్‌నారాయణ, రెండో వైస్ గవర్నర్ ప్రతాప్‌యాదవ్, జిల్లా కేబినెట్ సెక్రటరీ సుధ రెడ్డి, ట్రెజరర్ సౌమ్య, రీజియన్ చైర్‌పర్సన్ రామచంద్రరెడ్డి, జోన్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ నరసింహులు, నగరి, పుత్తూరు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కల్వర్టు కొరత తీరింది


మొరవ కాలువపై కల్వర్టు కావాలని అర్జీ ఇస్తున్న గ్రామస్తులు(ఫైల్)


నిర్మాణం పూర్తయిన కల్వర్టు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ కట్టకింద ఇండ్లు గ్రామవాసులు చాలా రోజులుగా కల్వర్టు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులతో కల్వర్టు పూర్తి కావడంతో గ్రామస్తుల కల నెరవేరింది. అప్పట్లో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మాజీ డిప్యూటి సీఎం నారాయణస్వామి గ్రామానికి వచ్చారు. కల్వర్టు కావాలని కోరడంతో వెంటనే సర్పంచ్ గాలి మహేష్ బాబుకి పనులు చేపట్టాలని ఆదేశించారు. శ్రీకావేరిరాజుపురం పాతచెరువు మొరవపోతున్న కాలువను దాటి కట్టకింద ఇండ్లుకి గ్రామస్తులు, పిల్లలు వెళ్లాలంటే ఈ కల్వర్టు మాత్రమే దిక్కు. సర్పంచ్ గాలి మహేష్ బాబు గ్రామస్తుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ పరిధిలో రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. అందులో కట్టకింద ఇండ్లు గ్రామానికి కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు చెరువు మొరవపోతోంది. అయినా ప్రజలు ఇబ్బంది లేకుండా కల్వర్టుపై రాకపోకలు సాగిస్తున్నారు.

గ్యాస్ బర్నింగ్‌తో దహన క్రియలు

నగరి: నగరి శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ బర్నింగ్ షెడ్డులో మృతదేహాలను దహనం చేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. దీంతో దహన క్రియల పరంగా నగరి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తెరపడింది. ఈ బర్నింగ్ షెడ్‌ను మాజీ మంత్రి ఆర్కే రోజా గత పాలనలో ప్రారంభించారు. వినియోగించడంలో ఎన్నికల కోడ్ ఆపై ప్రభుత్వాలు మారడంతో జాప్యమవుతూ వచ్చింది. ప్రస్తుతం అన్ని వ్యవహారాలు ముగియడం, గ్యాస్ అమర్చడంతో బర్నింగ్ ప్రారంభమైంది. మృతుల కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయంలో సమాచారం అందించి రూ.4 వేలు ఫీజు చెల్లించి బర్నింగ్ షెడ్‌లో దహనం చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.


తొలి బర్నింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వైభవంగా మహాకుంభాభిషేకం

- ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా


రోజాను ఆశీర్వదిస్తున్న పండితులు


రోజాను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు

పుత్తూరు: పట్టణ పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకామాక్షిదేవి సమేత శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా మహాకుంభాభిషేక ఆలయ అష్టబంధన, విగ్రహ ప్రతిష్ట, గణపతి పూజ, కలశప్రతిష్ట, మండప ఆరాధన, గోపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా ఆలయ కుంభాభిషేకానికి అవసరమైన సామగ్రి అందజేశారు. అంతకు ముందు మాజీ మంత్రి రోజాకు ఆలయ నిర్వాహకులు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చన, హారతి, తీర్థ ప్రసాదాలు, వేద మంత్రాలతో పండితులు ఆమె ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దామోదరరెడ్డి, గోపాల్‌రెడ్డి, మునయ్య, లోకయ్య, శివయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు జ్యోతి, ఏకాంబరం, బాలాజీ, గుణ, బాలసుబ్రమణ్యం, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు ఈశ్వరయ్యయాదవ్, రవీంద్ర, ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, దిలీప్, లక్ష్మణమూర్తి, గోపి, లారీమోహన్, కుట్టి, చిరంజీవి, సుబ్రమణ్యం, మునిరత్నం, పురుషోత్తంరెడ్డి, లోకయ్య, హరినాథ్‌రెడ్డి, కుమార్, గురుశంకర్, ఎంకారెడ్డి, లోకనాథరెడ్డి, నారాయణరెడ్డి, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం


సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

కార్వేటినగరం: మండలంలోని ఆర్‌కేవీబీపేట పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు దేవయ్య, షఫీని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ గురువును మించిన దేవుడు లేడన్నారు. టీచర్లకు విద్యార్థులు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులు చూపిన మార్గంలో పయనిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. పిల్లల ఉన్నతికి సహకరించే టీచర్లు, కష్టపడే తల్లిదండ్రులే నిజమైన హీరోలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ సుజాత, హెచ్‌ఎం కేశవులు (డీఎం పురం) ఉపాధ్యాయులు వెంకటేష్, గుర్రప్ప, సులోచన, సెల్వం, శ్రీధర్, అరుణకుమారి, సీఆర్పీలు మీనాకుమారి, కార్తవరాయన్, ఎంఈఎస్ కో–ఆర్డినేటర్ రేఖ పాల్గొన్నారు.

అర్హులందరికీ రాయితీ రుణాలు

కార్వేటినగరం: బీసీ, ఈబీసీ, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా అర్హులందరికీ రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రుణాల కోసం ఈ నెల 7వ తేదీలోపు ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కత్తెరపల్లెలో క్యాన్సర్ స్క్రీనింగ్


వైద్యాధికారులతో వైఎస్సార్‌సీపీ నేతలు

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లెలోని రైతు సేవాకేంద్రంలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో వైద్యాధికారులు భువనేశ్వరి, హేమశ్రీ మాట్లాడుతూ తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు. పీహెచ్‌సీల్లో సైతం క్యాన్సర్‌కు చికిత్స అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో 105 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ తేజశ్వీని, డాక్టర్ హిమబిందు, సీహెచ్‌ఓ రాజేశ్వరి, పీహెచ్‌ఎన్ గౌరి, విస్తరణాధికారి త్యాగు పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

గుడిపాల: గ్రామీణులందరికీ వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష తెలిపారు. మండలంలోని 197 రామాపురంలో శుక్రవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచానపడ్డ రోగుల ఇంటివద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా రక్తపరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి నెలకు అవసరపడే మాత్రలను అందజేశారు.

డైయింగ్ యూనిట్లతో ప్రమాదం

- భావితరాల కోసం నిర్ణయం తీసుకోవాలి
- గడువు అడిగారు.. ఏం చర్యలు తీసుకున్నారంటూ గొంతెత్తిన కౌన్సిలర్లు
- డైయింగ్ యూనిట్లు నిబంధనల మేరకు జరగడం లేదు
- కౌన్సిల్ సాక్షిగా తేల్చి చెప్పిన ఇంజినీరింగ్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, డైయింగ్ యూనిట్ల వ్యవహారంపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

నగరి: డైయింగ్ యూనిట్ల వ్యవహారంపై మున్సిపల్ కౌన్సిల్ దద్దరిల్లింది. భావితరాలవారు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే డైయింగ్ యూనిట్లు మూసివేయడం ఒక్కటే మార్గమని కౌన్సిల్ ముక్తకంఠంతో తేల్చి చెప్పింది. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాను చదివి వినిపించారు. అజెండాలో పేర్కొన్న ఏపీఐఐసీ పరిశ్రమల నిమిత్తం భూమి కేటాయింపు అంశం కౌన్సిల్‌లో ఉంచారు. వచ్చే కంపెనీ ఏదో తెలిస్తేనే అనుమతిస్తామని అప్పటివరకు అనుమతించమని తెలిపారు. అనంతరం విప్ దయానిధి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, ఇంద్రయ్య, బిలాల్, గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత సమావేశంలో నిర్ణయించిన డైయింగ్ యూనిట్ల మూసివేత అంశాన్ని అజెండాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. టేబుల్ అజెండాలో ఉంచినా ఆమోదించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే నీరు కలుషితమై అందరికీ క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, సొరియాసిస్ వస్తున్నాయని వెంట్రుకలు రాలి పోతున్నాయని, పలువురికి బిడ్డలు పుట్టడం లేదన్నారు. కొందరు వృత్తి కదా అని అంటున్నారని ప్రాణాలకన్నా వృత్తి ముఖ్యం కాదన్నారు. పదేళ్లుగా నేత వృత్తి మందగించిందని, మునుపటిలా ఆర్డర్లు లేవన్నది నేత పరిశ్రమవారిని కదిలిస్తే వచ్చే సమాధానమన్నారు. గతంలో లేని రాక్షస డైయింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నారని ఇదెలా సాధ్యమన్నారు. అంటే నూలుకు రంగులు అద్ది రసాయన నీరు వదలడానికి మాత్రమే నగరి పట్టణాన్ని ఎంచుకున్నారని ఆరోపించారు. అధికారులు వీటిపై ఏ చర్యలు తీసుకున్నారో తేల్చాలని పట్టుబట్టారు.

నిబంధనలు నిమజ్జనం

మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. 51 మాన్యువల్ డైయింగ్ యూనిట్లు, 16 మెకానికల్ డైయింగ్ యూనిట్లు ఉన్నాయన్నారు. వీటిలో మాన్యువల్ డైయింగ్ యూనిట్ల కోసం కామన్ ఈటీపీ ఉందన్నారు. మెకానికల్ డైయింగ్ యూనిట్లలో ఎనిమిదింటికి ఈటీపీ, ఆర్వో అంటూ ఏ ప్లాంటు లేదన్నారు. ఇవి కామన్ ఈటీపీతోనే అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. మరో 8 మెకానికల్ డైయింగ్ యూనిట్లకు ఈటీపీ, ఆర్వో ఉన్నా ఆరు యూనిట్లు వాటిని వాడడం లేదన్నారు. వీరంతా కలుషిత నీటిని మున్సిపల్ కాలువలు, నీటి పారుదల కాలువలు, చెరువులు, కుశస్థలి నదిలోకి వదిలేస్తున్నారన్నారు. 1965 మున్సిపల్ చట్టం ప్రకారం ఏ యూనిట్ కూడా మున్సిపల్ లైసెన్సు, ఎన్‌ఓసీ తీసుకోలేదన్నారు. కామన్ ఈటీపీ కూడా మరమ్మతులకు లోనైందని దానికి రసాయన నీటిని పంపినా అలాగే బయటకు రావడం మినహా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దీంతో డైయింగ్ యూనిట్లు నిబంధనలు రసాయన నీటిలో నిమజ్జనం చేసినట్లు తేటతెల్లమైంది. కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం మేరకే వ్యవహరిస్తామని చైర్మన్, కమిషనర్ సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఆప్టా డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ ప్రైమరీ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, మునాఫ్ అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈవో వరలక్ష్మి చేతుల మీదుగా నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరింపజేసి వినతిపత్రం అందజేశారు. డీఈవోతో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆ సంఘం నాయకులు అన్సర్, శంకర్‌రెడ్డి, యమున పాల్గొన్నారు.